వైకుంఠవాసా.. శ్రీ శ్రీనివాసా గోవిందా..!

మదనపల్లె సిటీ: పట్టణంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు కనులపండువగా జరిగాయి. వైష్ణవ ఆలయాలన్నీ గోవింద నామస్మరణలతో మార్మోగాయి. పర్వదినాన్ని పురస్కరించుకుని పలు ఆలయాల్లో భక్తులు వైకుంఠ ఉత్తర ద్వార దర్శనం కలిగించారు. సోమవారం వేకువజామునుంచే ఆలయాల్లో వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో స్వామి వార్ల మూలవిరాట్‌లకు వేదపండితులు లక్ష్మణ,బాలాజీస్వాములు మహాక్షీరాభిషేకం ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తర ద్వారం వద్ద అప్పటికే సర్వాంగ సుందరంగా అలంకరించిన పుష్పవేదికపై ఉత్సవ మూర్తులను ఆశీనులు గావించారు. భక్తులు గోవింద నామస్మణతో ఉత్తర ద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించి స్వామని దర్శించుకున్నారు.

వెంకన్న సేవలో ఎమ్మెల్యే, ఆర్డీఓ

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా, మున్సిపల్ చైర్మన్ మనూజ, ఆర్డీవో మురళి, డీఎస్పీ కేశప్ప,మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ శ్రీనివాసులు ప్రసన్న వెంకటరమణస్వామిని ఉత్తర ద్వారంగుండా దర్శించుకున్నారు. దేవదాయశాఖ ఏసీ విశ్వనాథ్, ఆలయ ఈఓ రమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి పూజలు

పీలేరు : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని మండలంలో పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రధానంగా సోమవారం తెల్లవారిజామున 5 గంటల నుంచి కోటపల్లెలోని శ్రీ పద్మావతి ఆండాల్ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు వైకుంఠద్వార దర్శనం కల్పించారు. అలాగే స్థానిక కడప మార్గంలోని వెంకటాద్రిక్ల సమీపంలో గల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, మండలంలోని అగ్రహారం లక్ష్మీనరసింహస్వామి ఆలయం, స్థానిక మదనపల్లె మార్గంలోని చెన్నకేశవస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. కోటపల్లె ఆలయంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, ఉమాకాంతరెడ్డి, నరసింహారెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, కడప మార్గంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.


వెంకన్నను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఆర్డీఓ మరళి


తంబళ్లపల్లె : వైకుంఠ ద్వారం వద్ద టీటీడీ అధికారులు, భక్తులు

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కలికిరి: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు ఆయాలకు భక్తులు పోటెత్తారు. కలికిరి పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మీనరసింహాలయం, శ్రీవాసవికన్యకాపరమేశ్వరి ఆలయం, గుండ్లూరు చెన్నకేశవాలయం, చక్కెరవాండ్లపల్లిలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వరాలయాల్లో నిర్వాహకులు వైకుంఠ ద్వార దర్శన ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.

తంబళ్లపల్లె: మండలంలో సోమవారం వైకుంఠ ఏకాదశి ఘనంగా జరిగింది. కోసువారిపల్లె శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ ఇన్‌స్పెక్టర్ రెడ్డిభాస్కర్ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి జరిగింది. వైకుంఠ ద్వారం ఏర్పాటు చేసి భక్తులకు వైకుంఠద్వార దర్శనం కల్పించారు. అర్చకులు రమేష్, రాఘవేంద్రలు స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సర్పంచు విజయలక్ష్మీ, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, నాయకులు శంకర్‌రెడ్డి, కోటిరెడ్డి, రమణారెడ్డి, రఘునాథ్ పలువురు ప్రముఖులు వైకుంఠ ద్వారం తో స్వామి దర్శనం చేసుకున్నారు. గ్రామస్తుల సహకారంతో వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. మల్లయ్యకొండపై గల శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో కూడా వైకుంఠ ఏకాదశి సందర్భంగా పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు చేశారు.

భక్తులతో ఆలయాలు కిటకిట

ములకలచెరువు: వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక శ్రీ కనుగొండరాయ స్వామి ఆలయం, బిల్లూవారిపల్లె శ్రీ రామాలయం, బురకాయలకోట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. పండితులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. మహిళలు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

వైష్ణవాలయాలకు వైకుంఠ శోభ

బి.కొత్తకోట: వైష్ణవాలయాలకు సోమవారం వైకుంఠశోభ సంతరించుకొంది. స్థానిక చెన్నకేశవ, బీసీకాలనీ వెంకటేశ్వరాలయాల్లో తెల్లవారుజాము నుంచే వైకుంఠ ద్వారాలను తెరచి ఉంచారు. భక్తులు పెద్దసంఖ్యలో వైకుంఠ ద్వారం నుంచి ఆలయంలోకి ప్రవేశించి స్వామిని దర్శించుకొన్నారు. సాయంత్రం వరకు భక్తుల తాకిడి తగ్గలేదు. ఆలయ నిర్వాహకులు భక్తుల కోసం ప్రత్యేక క్యూ ఏర్పాటు చేసి తీర్థప్రసాదాలను అందించారు.

గుర్రంకొండ: గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో వైకుంఠ ఏకాదశి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తరిగొండలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో ఉత్తర ద్వారం వైపు స్వామివారిని కొలువుదీర్చారు. ఉత్తరద్వారం వైపు భక్తులు ఆలయంలో ప్రవేశించేటట్లుగా అధికారులు ఏర్పాట్లు చేశారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గుర్రంకొండలోని బలిజగడ్డలో భూదేవి, శ్రీదేవి సమేతశ్రీమహావిష్ణువు స్వామివార్ల కల్యాణం కన్నులపండుగగా నిర్వహించారు. మండలంలోని శ్రీ మహావిష్ణువు ఆలయాన్ని భక్తుల సందడితో కిటకిటలాడాయి.

భక్తిశ్రద్ధలతో పూజలు

నిమ్మనపల్లె : మండల పరిధిలో వైకుంఠ ఏకాదశి పర్వదినవేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అగ్రహారం మండెంవారిపల్లె కోదండరామస్వామి ఆలయం, నిమ్మనపల్లె అభయాంజనేయస్వామి ఆలయం, తవళం శ్రీనేలమల్లేశ్వరస్వామి దేవాయలంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అగ్రహారం కోదండరామాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా చేసిన వైకుంఠద్వార దర్శన ఏర్పాట్లు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

పెద్దమండ్యం: మండలంలోని పెద్దమండ్యం కోదండరామస్వామి ఆలయం, పాపేపల్లె శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాలలో సోమవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ వైకుంఠద్వారం ద్వారా భక్తులకు స్వామిదర్శనం కల్పించారు. ఆలయాలలో వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. చెరువుకిందపల్లె వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

రామసముద్రం: మండలంలోని విష్ణు ఆలయాల్లో సోమవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని వైభవంగా పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీ జనార్ధనస్వామి , చెంబకూరులో వెలసిన శ్రీకోదండరామస్వామి, శ్రీగట్టు వెంకటరమణస్వామి, మినికి గ్రామంలోని శ్రీకళ్యాణ వెంకటరమణస్వామి, కుదురుచీమనపల్లెలోని శ్రీవేణుగోపాలస్వామి , వనగానిపల్లెలోని వెంకటేశ్వరస్వామి, ఆర్.నడింపల్లెలోని శ్రీకోదండరామస్వామి ఆలయాల్లో ఘనంగా వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఉపవాస దీక్షలతో తరలివెళ్లి స్వామివారిని ఉత్తర ద్వార దర్శనంలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే రాత్రి ఆలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


పీలేరు: వేంకటేశ్వరస్వామిని దర్శంచుకుంటున్న భక్తులు


తరిగొండ ఆలయంలో భక్తుల రద్దీ


రామసముద్రం : ప్రత్యేక అలంకరణలో శ్రీకోదండరామస్వామి

క్లుప్తంగా

వాటర్‌షెడ్ ద్వారా అభివృద్ధి పనులు

పెద్దమండ్యం: వాటర్‌షెడ్ కార్యక్రమం ద్వారా ఎంపిక చేసిన గ్రామాల్లో విరివిగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జి రమేష్ తెలిపారు. మండలంలోని పాపేపల్లె, కోటకాడపల్లె గ్రామాలలో సోమవారం వాటర్‌షెడ్ ద్వారా చేపడుతున్న పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్‌లు నరసింహులు, రమణారెడ్డి, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

కస్తూర్బాలో విలువలతో కూడిన విద్య

కేవీపల్లె : కస్తూర్బాగాంధీ విద్యాలయంలో విలువలతో కూడిన విద్య అందుతోందని ఎంఈఓ రెడ్డిబాషా అన్నారు. సోమవారం వగళ్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంకు స్థానిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థినుల తల్లిదండ్రులు రామాంజులు, వాణి దంపతులు మైక్ సెట్ వితరణ చేశారు. ప్రిన్సిపాల్ శ్రావణి, బోధనా సిబ్బంది జ్యోత్స్న, అన్నపూర్ణ, శైలజ, మున్నిషా, రాధ, ఇందిరమ్మ పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సహకరించాలని వినతి

కేవీపల్లె : మండల అభివృద్ధికి మరింత సహకారం కావాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. సోమవారం తిరుపతిలో ఎంపీని కలసి దుశ్శాలువతో సత్కరించారు. మండలంలోని వివిధ సమస్యలు, అభివృద్ధి గురించి ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ తనసహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గజ్జెల శీన్‌రెడ్డి, చంద్రగిరి యల్లయ్య, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ మైండ్స్ సేవలు ప్రశంసనీయం

మదనపల్లె సిటీ: హెల్పింగ్ మైండ్స్ సేవలు ప్రశంసనీయమని డీఎస్పీ కేశప్ప అన్నారు. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో హెల్పింగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో జర్నీ ఆఫ్ హెల్పింగ్‌మైండ్స్ వీడియో ఆవిష్కరించారు. డీఎస్పీ మాట్లాడుతూ యువత సేవ కార్యక్రమాలు చేయాలని సూచించారు. రక్తదానం, ఫుడ్‌బ్యాంక్, హెయిర్ డొనేషన్, స్నేక్ రెస్క్యూ వంటి సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబుబాకర్‌సిద్దిక్, సభ్యులు జైనుల్లా, బాలాజీ, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి రూ.4.19 లక్షల ఆదాయం

బి.కొత్తకోట: నూతన ఏడాది సందర్భంగా ఆదివారం మండలంలోని హార్సిలీహిల్స్‌కు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపడం ద్వారా రూ.4,19,044 ఆదాయం లభించిందని మదనపల్లె ఒకటవ డిపో మేనేజర్ వెంకటరమణారెడ్డి సోమవారం తెలిపారు. 23 ఆర్టీసీ బస్సులు 5,356 కిలో మీటర్లకుపైగా నడిచాయని తెలిపారు. సందర్శకులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించామని తెలిపారు. వచ్చే శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని తంబళ్లపల్లె మల్లయ్యకొండపైకి 20 బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకొంటున్నామని తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

నిమ్మనపల్లె : మండల పరిధిలోని గండిమాలపల్లె ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ రాజగోపాల్ సోమవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. భోజన నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహార పదార్థాలు వడ్డిస్తున్నారా లేదా అనే విషయమై స్థానిక హెచ్‌ఎంను విచారించారు. భోజనంపై సంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యత లోపం లేకుండా మధ్యాహ్న భోజన పథకం నిర్వహించాలన్నారు.

ఉర్దూ క్యాలెండర్లు ఆవిష్కరణ

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరు రోడ్డులోని మదరస-ఏ-దారూల్ రెహమానియా ఆధ్వర్యంలో నూతన సంవత్సతర ఉర్దూ క్యాలండర్లను సోమవారం ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా ఆవిష్కరించారు. ఆంగ్ల సంవత్సర క్యాలండర్‌తో పాటు ఇందులోనే ముస్లింలకు అనుకూలంగా ఇస్లామిక మాసంకు కూడా ఇందులో పొందుపరిచారు. మదరస కమిటీ సభ్యులు మహమ్మద్‌ఖాన్, బషీర్, ఇస్మాయిల్, రఫీక్‌బేగ్, చాంద్‌బాష, పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ల ఆవిష్కరణ

పీలేరు రూరల్ : పీలేరు కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 క్యాలెండర్‌ను రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి ఆవిష్కరించారు. సోమవారం కార్పెంటర్ అసోసియేషన్ నాయకులు తిరుపతిలో ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా క్యాలెండర్లు ఆవిష్కరించిన ఎంపీ మాట్లాడుతూ కార్పెంటర్ల సంక్షేమానికి తనవంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

గ్రామసభ తీర్మానాలకు ప్రాధాన్యత

బి.కొత్తకోట: పంచాయతీ గ్రామసభలో ప్రజలు చేసే తీర్మానాలకు ప్రాధాన్యత ఉంటుందని సర్పంచ్ భీమిగాని నాగిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గ్రామపంచాయతీల్లో గ్రామసభలను నిర్వహించారు.

రూ.22 లక్షలతో కల్వర్టుల నిర్మాణం

మండలంలోని వేమిలేటికోట పంచాయతీలో ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.22 లక్షలతో చేపట్టిన రెండు కల్వర్టుల నిర్మాణ పనులను సోమవారం సర్పంచు రవికుమార్ రెడ్డి ప్రారంభించారు.

మైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

– రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్ ఖాన్

కలికిరి: మైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్ అన్నారు. మండలంలోని కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలోని తొమ్మిది మసీదుల అభివృద్ధికి ఎంపీ మిథున్ రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.43 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఏపీఎండీపీ డైరెక్టర్ హరీష్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. కలికిరి పరిధిలోని మసీదులలో అవసరమైన పనులను గుర్తించి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఆయా మసీదులలో కమిటీ సభ్యులే అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా మైనారిటీల అభివృద్ధే లక్ష్యంగా స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎంపీ పీవీ మిథున్ రెడ్డి కృషి చేస్తున్నారని గుర్తుచేశారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలకు మైనారిటీలు రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమాలలో నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, మండల కో–ఆప్షన్ సభ్యులు రిజ్వానుల్లా, మండల పార్టీ కన్వీనర్ రమేష్ రెడ్డి, నాయకులు ఎస్టీడీ హరి, ఆహుమొహిద్దీన్, ఖాదర్‌వల్లి, బావాజీ, ఫయాజ్, నూర్‌మొహ్మద్, సైదు పాల్గొన్నారు.


నిధుల మంజూరు పత్రాలను అందజేస్తున్న మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం నగిరిమడుగు పంచాయతీలో ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల పాల్గొని, ప్రకృతిసాగు కోసం తయారుచేసే ద్రవ జీవామృతాన్ని పరిశీలించారు. అనంతరం ఒక నాటి ఆవుతో లభ్యమయ్యే వ్యర్థాలైన పేడ, పంచితంతో ప్రకృతి సాగు, అలాగే ఆవు ద్వారా ఎన్నో పోషకాలు ఉండే పాలు, రసాయనిక మందులు ఖర్చులు లేకుండా జీవామృతాలు తయారు చేసుకునే పద్ధతులను సిబ్బంది ఎమ్మెల్యే చింతలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో సైతం ప్రకృతిసాగులో లభ్యమయ్యే కూరగాయలకే డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, వీటి ద్వారా రైతులకు అధిక లాభాలు సాధ్యమన్నారు. ప్రకృతిసాగు వైపు అడుగులు వేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో హేమలత, హార్టికల్చరల్ అధికారిణి లక్ష్మి ప్రసన్న, ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది శ్రీనివాసులు, స్వాతి, రాధమ్మ, ఎల్లారెడ్డి, వెంకట రెడ్డి, అరుణ్ కుమార్, పార్వతమ్మ పాల్గొన్నారు.


ద్రవ జీవామృతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అనాథ ఆశ్రమాల్లో పుస్తకాల పంపిణీ

మదనపల్లె : నూతన సంవత్సర ప్రారంభం సందర్భంగా సేవాకార్యక్రమాల్లో పాలుపంచుకోవాలన్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు పట్టణంలోని అనాథ ఆశ్రమాల్లో విద్యార్థులకు నోటుపుస్తకాలు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. సోమవారం పట్టణంలోని కూరపర్తి సాయిచైతన్య ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్, చైతన్య స్వచ్ఛందసేవాసంస్థల్లో టూటౌన్ సీఐ మురళీకృష్ణ, తాలూకా సీఐ సత్యనారాయణలు విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. స్వచ్ఛందసంస్థల్లో విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తెస్తే తమవంతు సహాయం అందిస్తామన్నారు. కూరపర్తి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ పద్మనాభరెడ్డి, చైతన్యసేవాసంస్థ ఆనంద్ ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు పిల్లలందరి తరపున ధన్యవాదాలు తెలిపారు.

అర్హులందరికీ కొత్త పింఛన్లు మంజూరు

గుర్రంకొండ: అర్హులైన లబ్ధిదారులందరికీ కొత్త పింఛన్లు మంజూరు అయ్యాయని ఎంపీడీఓ వెంకటేశులు, మండల ప్రత్యేక ఆహ్వానితులు చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని శెట్టివారిపల్లె సచివాలయంలో లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ లబిద్ధదారులకు అదనంగా పెంచిన రూ. 250తో కలిపి మొత్తం రూ. 2750 ఇస్తున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ సరస్వతమ్మ, మాజీ సర్పంచ్‌లు సూరి, ఎస్వీరమణ, పంచాయతీ కార్యదర్శి ప్రమీల, గురుశేఖర్ పాల్గొన్నారు.

130 మందికి వైఎస్సార్ పింఛను కానుక

పెద్దమండ్యం: మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరధిలో కొత్తగా 130 మందికి వైఎస్సార్ పింఛను కానుక మంజూరైనట్లు ఎంపీడీఓ శ్రీధర్‌రావు తెలిపారు. గత ఆరు నెలల కాలంలో వైఎస్సార్ పింఛను కానుక కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు ప్రభుత్వం పింఛను మంజూరు చేస్తూ ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. మంగళవారం తంబళ్లపల్లె ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చేతుల మీదుగా వీరికి పింఛను సొమ్ము అందజేస్తారని తెలిపారు.


పింఛన్ లబ్ధిదారులతో సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి

అర్హులందరికీ పింఛన్లు

కలకడ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటప్రకారం పింఛన్ పెంచి నూతన సంవత్సర కానుకగా అందించారని కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కోన సచివాలయంలో పెంచిన పింఛన్లు, నూతన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్బీకే అధ్యక్షుడు చింతకుంట హరినాథరెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితురాలు గుడిటి సరళ, మధుసూదన్‌రెడ్డి, వీఆర్‌ఓ రవిచంద్రన్, పంచాయతీ కార్యదర్శి మునిరాజ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయండి

కలకడ : మండలంలో జగనన్న కాలనీలలో ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీపీ శ్రీదేవి కోరారు. సోమవారం మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీలోని జగనన్న కాలనీలను సందర్శించారు. పేదల సొంతింటి కల నెరవేర్చమే లక్ష్యంగా ముఖ్యమంత్రి అర్హత కలిగిన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తున్నారన్నారు. అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకుని ఇంటి నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయాలని ఆకాంక్షించారు.

14మంది జూదరుల అరెస్ట్

మదనపల్లె : కోడిపందెం ఆడుతున్న 14మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. మదనపల్లె మండలం చీకలబైలు సమీపంలో జోరుగా కోడిపందేలు జరుగుతున్నాయని అందిన సమాచారం మేరకు ఎస్ఐ సుధాకర్, చంద్రశేఖర్‌లు దాడులు జరిపారన్నారు. జూదరులను అరెస్ట్ చేసి రూ.24,000 నగదు, మూడు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

నేడు కొత్త పెన్షన్ల పంపిణీ

పెద్దతిప్పసముద్రం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి చేతుల మీదుగా కొత్తగా మంజూరైన వైఎస్సార్ పెన్షన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పెద్దతిప్పసముద్రం మండలానికి 306 మందికి, బి.కొత్తకోటకు 243, కురబలకోటకు 211, పెద్దమండ్యంకు 177, తంబళ్ళపల్లికి 207, ములకలచెరువు మండలంలో 168 మందికి పెన్షన్ కానుక మంజూరైనట్లు తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలోని కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు పెన్షన్ లబ్ధిదారులతో పాటు తప్పనిసరిగా సభకు హాజరు కావాలని ఎంపీడీఓ పేర్కొన్నారు.

మదనపల్లె సబ్‌డివిజన్‌లో 30 యాక్ట్ అమలు

మదనపల్లె : మదనపల్లె పోలీస్ సబ్ డివిజన్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో జనవరి 31వ తేదీ వరకు 30 పోలీస్‌యాక్ట్ అమలులో ఉంటుందని డీఎస్పీ కేశప్ప తెలిపారు. సోమవారం ఆయన విడుదల చేసిన ఉత్తర్వుల్లో.. నూతన సంవత్సర వేడుకలు, వైకుంఠ ఏకాదశి, సంక్రాంతి పండుగలను దృష్టిలో ఉంచుకుని, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా యాక్ట్‌ను ప్రకటించినట్లు చెప్పారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుమల, తిరుపతికి వెళ్లేందుకు అనంతపురం, కర్నాటక భక్తులకు మదనపల్లె మీదుగా రహదారి ఉన్నందున వారికి ఇబ్బందులు లేకుండా, పండుగలకు అధిక సంఖ్యలో ఇతర ప్రాంతాల నుంచి స్వస్థలాలకు వచ్చే ప్రజలతో శాంతిభద్రలకు విఘాతం కలగకుండా చూడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఇందులో భాగంగా మదనపల్లె పట్టణం -1,2, తాలూకా, ముదివేడు, బి.కొత్తకోట, నిమ్మనపల్లె, ములకలచెరువు, పీటీఎం, తంబళ్లపల్లె, పెద్దమండ్యం పోలీస్‌స్టేషన్ల పరిధిలో 30 పోలీస్ యాక్ట్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. యాక్ట్ ప్రకారం బహిరంగ రోడ్లు, ప్రదేశాలు, మార్గాల్లో ఊరేగింపులు, ఐదుగురు అంతకంటే ఎక్కువమంది వ్యక్తులు ఒకచోట గుమికూడటం, ఆయుధాలు లేదా సామాన్యప్రజలకు ప్రమాదం కలిగించే వస్తువులతో సంచరించడం, బహిరంగసభలు నిర్వహించడం పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు.


డీఎస్పీ కేశప్ప

ప్రజాసమస్యల పరిష్కారానికే స్పందన

మదనపల్లె : ప్రజాసమస్యల పరిష్కారానికి స్పందన కార్యక్రమాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో రెవెన్యూ డివిజన్ పరిధిలో వివిధ సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కోళ్లబైలు సర్వేనెంబర్ 889/5లో కోట్ల రూపాయల విలువచేసే భూమిని వ్యవసాయం కోసం డీకేటీ పట్టా పొందిన వ్యక్తులు బండను పగులగొట్టి ఇళ్ల నిర్మాణాలు చేస్తూ విక్రయాలు చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేస్తే పట్టించుకోకపోగా, పరోక్షంగా ఆక్రమణదారులకు సహకరిస్తున్నారన్నారు. తక్షణమే భూమిని స్వాధీనం చేసుకుని, ఆక్రమణలకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. వాల్మీకిపురం మండలం చింతపర్తికి చెందిన షేక్‌బీబీజాన్ తన భర్త షేక్‌సయ్యద్ జీవించి ఉన్న సమయంలో తమకు తెలపకుండా మదనపల్లె బీకేపల్లె గ్రామం 534-3, 521-2 సర్వే నెంబర్లలో 125 చదరపుగజాల స్థలాన్ని కొనుగోలు చేసి కుమారుడైన షేక్‌మహబూబ్‌బాషా పేరుమీద రిజిస్టర్ చేయించారన్నారు. ఈ విషయం భర్త మరణించిన తర్వాత బీరువాలో దొరికిన డాక్యుమెంట్ ఆధారంగా తమకు తెలిసిందని, సదరు స్థలం ఎక్కడుందో చూపాల్సిందిగా మున్సిపల్ సర్వేయర్లకు చలానా చెల్లించి, పలుమార్లు వినతి చేసినా స్పందన కరువైందని ఫిర్యాదు చేసింది. పటేల్‌రోడ్డు పిక్నిక్ హోటల్ పక్కన సందు మొదట్లో చెత్తను పడవేయటంతో దుర్వాసన వస్తోందని కమిషనర్ ప్రమీలకు ఫిర్యాదు చేశారు. సబ్‌కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో ఏఓ శేషయ్య, డివిజనల్ సర్వేయర్ మునికన్నన్, మున్సిపాలిటీలో డీఈ శిరీషా, ఏఈ స్నేహప్రియ, ఆర్వో పల్లవి, టీపీఎస్ పూర్ణ పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ మురళి

పెద్దిరెడ్డిపై విమర్శలు తగవు

కురబలకోట: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిపై రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు అర్థరహిత విమర్శలు చేయడం సరికాదని కురబలకోట ఎంపీపీ బి. దస్తగిరి, రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ సురేంద్రనాథ్, సర్పంచ్ ఆర్‌కె కృష్ణారెడ్డి మండిపడ్డారు. కురబలకోటలో సోమవారం జరిగిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడుతూ చినబాబు సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. నీరుగట్టివారిపల్లెలో ఆయన ఉన్న ప్రాంతంలో కూడా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గెలిచారన్నారు. దీన్ని బట్టి స్థానికంగా చినబాబు సత్తా ఏమిటో తెలిసి వస్తోందన్నారు. వార్డు మెంబరుగా కూడా గెలవలేని ఆయన పెద్దిరెడ్డి కుటుంబీకులపై విమర్శలకు దిగడం మూర్ఖత్వమే అవుతుందని గుర్తుంచుకోవాలన్నారు. మగ్గాల సొసైటీ పేరుతో ఎంత దోచేసింది అందరికీ తెలిసిందేనన్నారు. స్థాయిని మరచి అవాకులు చెవాకులు మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్న పెద్దిరెడ్డి కుటుంబాన్ని లెక్కలేని విధంగా మాట్లాడితే చూస్తూ ఊరుకునేదిలేదన్నారు. జిల్లా కార్యదర్శి బైసాని చంద్రశేఖర్ రెడ్డి, సోమిరెడ్డి, ముస్తాక్, హరి, బావాజాన్, హసన్‌వల్లీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోండి

గుర్రంకొండ: విద్యార్థులు ప్రభుత్వం అందించిన ట్యాబల్‌ను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సమ్రీన్ ముక్తియార్, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల సూచించారు. సోమవారం మండలంలోని గుర్రంకొండ, తరిగొండ జెడ్పీ హైస్కూళ్లలో ఎనిమిదవ తరగతి విద్యార్థులు 240 మందికి ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జగనన్న విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారన్నారు. ఆధునిక సాంకేతికతతో కూడుకొన్న ట్యాబ్‌లు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సురేంద్రబాబు, వైస్ ఎంపీపీ సరస్వతమ్మ, సింగిల్‌విండో డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు సక్కా చంద్రశేఖర్, జమీర్ ఆలీఖాన్, సర్పంచ్ వెంకట్రమణమ్మ, ఎంపీటీసీ ఖదీర్, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ సురేష్, హెచ్‌ఎంలు శివన్న, నరసింహప్రసాద్, పీడీ రమేష్‌బాబు పాల్గొన్నారు.